తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
మంగళవారం
12 మే 2026
పేజీలు : 08





- పీర్జాదిగూడలో వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఫిర్యాదులు అనేకం.. అయినా అధికారుల తీరుపై అనేక ప్రశ్నలు

# పెద్దచెరువులో కంటి 'తుడుపు'

## ప్రహరీని కూల్చి చేతులు దులిపేసుకున్నారా?

**బోడుప్పల్, మే 11 (జనంసాక్షి) :** మేడిపల్లి మండలం పీర్జాదిగూడ పెద్ద చెరువు పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా హద్దులు గుర్తించి మార్కింగ్ నిర్వహించారు. పరిశీలనలో బఫర్ జోన్‌లో మూడు అక్రమ నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో మరో మూడు నిర్మాణాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే నిర్మాణాలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నప్పటికీ, అధికారులు మాత్రం కేవలం ప్రహరీ గోడలు కూల్చివేసి "చెరువును కాపాడాం" అంటూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం, చెరువును ఆక్రమిస్తూ నిర్మాణాలు ప్రారంభమైన దశలోనే అధికారులు స్పందించి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని అంటున్నారు. నిర్మాణ పనులు నెలల తరబడి సాగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ,మున్సిపల్ శాఖలు చూసీ చూడనట్టు వ్యవహరించాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో చెరువులో మట్టి నింపిన ఘటనల్లో కేసులు నమోదు చేసి హడావుడి చేసిన అధికారులు, ఇప్పుడు ఎఫ్‌టీఎల్‌లో నేరుగా నిర్మాణాలు జరుగుతున్నా ఎందుకు వెనకడుగు వేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అప్పట్లో చిన్న చిన్న చర్యలకే కేసులు పెట్టిన అధికారులు, ఇప్పుడు భారీ నిర్మాణాల విషయంలో మాత్రం నిశ్శబ్దంగా ఉండటం అనుమానాలకు తావిస్తోంది. "చెరువు హద్దుల్లో నిర్మాణాలు జరుగుతున్న విషయం అధికారులకు తెలియదా..? లేక తెలిసీ చర్యలు తీసుకోవడం లేదా..?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరి అండ ఉంది.. ఈ నిర్మాణాల వెనుక ఉన్న ఆ "పెద్ద మనిషి" ఎవరు..? అనే చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. స్థానికులు ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ, ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు ఇప్పటివరకు పూర్తి స్థాయి కూల్చివేతలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. కేవలం కంటి తుడుపు చర్యలతో సరిపెట్టకుండా, అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయి

- చేతలలో తంగేళ్లు దాటడం లేదు
- సిఐటియు జిల్లా నాయకులు కీసర నర్సిరెడ్డి



**హయత్ నగర్, మే 11 (జనం సాక్షి) :** భవన నిర్మాణ కార్మికుల అడ్డా మీద ప్రభుత్వం చలివేంద్రం, తడక పందిర్లు వేసి కార్మికులను ఎండ నుండి కాపాడాలని సిఐటియు డిమాండ్. నాగోల్ సర్కిల్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ డివిజన్ లో లేబర్ అడ్డా వద్ద నిత్యము వందలాది మంది కార్మికులు అడ్డా పైకి వచ్చి పనులు వెతుక్కుంటున్నారని అనేకమంది కార్మికులు త్రాగేందుకు నీరు లేక, ఉండేందుకు నీడలేక అనేక అవస్థలకు గురి అవుతున్నారని సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు కీసర నర్సిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిహెచ్ఎంసి, కార్మిక సంక్షేమ బోర్డు అధికారులు లేబర్ అడ్డాల వద్ద కార్మికులకు చలివేంద్రాలు, ఎండ రక్షణ కొరకు తడక పందిర్లు వేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుంటే కార్మికుల పట్ల ప్రభుత్వం, నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని వారికి రక్షణ చర్యలు తీసుకొని ఫలితంగా అనేక మంది కార్మికులు వడదెబ్బ, విరోచనాలు బారిన పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం మాటల్లో కోటలు దాటుతుంది చేతల్లో తంగేళ్లు దాటడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మాటలు డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్షన్ ప్లాన్ కు భిన్నంగా చర్యలు ఉన్నాయని, కావున తక్షణమే చర్యలు తీసుకొని ఎండ నుంచి కార్మికులను రక్షించేందుకు తడక పందిరులు లేదా టెంట్ లాంటివి వేసి కార్మికులను వడదెబ్బల నుండి కాపాడాలని కోరారు. భవన నిర్మాణ రంగం నుండి సెస్ రూపంలో వసూలు చేసి కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని అన్నారు. హయత్ నగర్ కార్మికుల అడ్డా కు ప్రతి రోజు వెయ్యి మంది కార్మికులు వచ్చి పనులు వెతుక్కుంటారని, పనులు దొరకకపోతే మధ్యాహ్నం వంటి గంట వరకు ఎదురుచూస్తూ ఇతర పనుల కోసం వెళ్తారని అన్నారు. ఈరోజు 10:30 ప్రాంతంలో కార్మికుల అడ్డాకు పోతే ఈ ఫోటోలో చూపించిన మాదిరిగా కార్మికులు ఉన్నారని, వారి రక్షణ కొరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, బలరాం, పి ఎల్లయ్య, పి రాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ నిరుద్యోగ యువతకు ఐక్యత పౌండేషన్ చేయూత

- పోలీస్ ఉద్యోగానికై శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ
- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

లోపలి పేజిలో

# ఎండలు అధికంగా రావడంతో ఉపాధి కూలీలు జాగ్రత్త వహించాలి..!

## ఎల్లకొండ గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్



**నవాబుపేట్ మే 11( జనం సాక్షి)** వేసవి కాలంలో ఎండలు అధికంగా కొడుతున్న సందర్భంగా నవాబుపేట్ మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో ఉపాధి హామీ కూలి పనులు చేస్తున్న సందర్భంగా సోమవారం వారికి గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్, ఉప సర్పంచ్ రామచందర్ ఆధ్వర్యంలో బట్టర్ మిల్క్, కూల్ డ్రింక్, మజ్జిగ ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వాళ్లకు అందజేశారు, సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ఉపాధ్యాయ కూలీలందరూ ఉదయం 6 గంటలకు వచ్చి పనులు తొందరగా ముగించుకొని పచ్చని చెట్ల కింద చల్లని వాతావరణంలో ఉండాలని ఆయన కోరినారు. ఎల్లకొండ పరిధిలోని పార్వతి పరమేశ్వరుల ఆశీస్సులతోటి ఎండాకాలంలోని గ్రామం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండి ఎండలు అధికంగా వస్తున్న సందర్భంగా గ్రామ ప్రజలందరినీ ఉపాధిఫీల్డ్ అసిస్టెంట్ జాగ్రత్తగా వారి పనులు చూసుకోవాలని వారికి సూచనలు ఇచ్చారు. ఎండలు అధికంగా ఉన్న సందర్భంగా ఉదయం తొందరగా వచ్చి వారికి ప్రభుత్వం ఇచ్చిన పనులను రెండు గజాల వెడల్పు ఐదు గజాలం పొడవు అర్ధగజము లోతు పనులను తొందరగా ముగించుకొని వారికి ఎండల్లో ఎండిపోతున్న మహిళలు అందరికీ మంచినీటి సమస్య ఎలాంటి ఇబ్బందులు లేకుండా బట్టర్ మిల్క్, కూల్ డ్రింకులు అందించి వారిని ఇబ్బందులు పెట్టకుండా తొందరగా ఉపాధి పనులు చేయించి వారిని ఇళ్ల వద్దకు వెళ్లే విధంగా చూడాలని కొండల్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి పనులు చేసే ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాలకు హానికరం లేకుండా జాగ్రత్తగా ఉండాలని వారు అన్నారు. ఉప సర్పంచ్ రామచందర్ మాట్లాడుతూ గ్రామంలోని ఉన్నటువంటి ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమకు సమాచారం ఇచ్చినట్లయితే ఆ సమస్యను నెరవేర్చు విధంగా చేస్తామని ఆయన అన్నారు. ఉపాధి కూలీలను ఇబ్బందులు పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్ చూసుకోవాలని అన్నారు. వారికి ఉదయం మంచినీళ్లు అందించాలి, వారిస్ ప్యాకెట్లు కూడా అందించి, వారిని ఎండాకాలంలో ఇబ్బందులు పెట్టకుండా చూసుకోవాలని వారు తెలిపారు. పని చేయించిన కాలంలోనే వారికి డబ్బులు కూడా ఎప్పటికప్పుడు వచ్చే విధంగా చూడాలని వారు అన్నారు. పనిచేసిన వెంటనే మేటీలు సంతకాలు తీసుకొని పై అధికారులకు అందజేసినట్లయితే ఉపాధి కూలీలకు డబ్బులు వెంటనే అందుతాయని వారు అన్నారు. ఉపాధి కూలీలు పని చేసే సమయంలో పాములు, పురుగులు, పనిచేసే సమయంలో దెబ్బలు తగలకుండా కూలీలు జాగ్రత్తగా వహించాలని గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ తెలిపారు. ఉపాధి పనులు చేసే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ కుమార్, ఉపాధి హామీ మేటీలు, ఫీల్ అసిస్టెంట్, కూలీలు గ్రామంలో ఉన్నటువంటి పెద్దలు అందరూ హాజరై ఉపాధి కూలీలకు సహ సాగరాలు అందించారు.

# జీహెచ్ఎంసీలో జూన్ 9 వరకు జనాభా గణన

## ప్రజలకు సహకరించాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పిలుపు



**ఖైరతాబాద్, మే 11, (జనం సాక్షి) :** జూన్ 9 వరకు నెల రోజులపాటు నిర్వహించనున్న జనాభా గణన ప్రక్రియలో ప్రజలందరూ జనాభా గణన కార్యక్రమా నికి పూర్తి స్థాయిలో సహకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. గ్రేటర్ హైదరాబా ద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలో అధికారులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాలను సేకరిస్తారని తెలిపారు. ప్రజలు సరైన సమాచారా న్ని అందించి ప్రభుత్వానికి సహకరించాలని ఆయ న విజ్ఞప్తి చేశారు. సోమవారం బంజారాహిల్స్ ఎన్. బి.టి నగరలో కమీషనర్ పర్యటించారు. నగర అ భివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పన, సం క్షేమ పథకాల అమలులో జనాభా గణన కీలక పా త్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు అవసరమైన వివరాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్, సర్కిల్-36(జూబ్లీహిల్స్)డిప్యూటీ కమిషనర్ శంకర్, సంబంధిత అధికారులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. జనాభా గణన ప్రక్రియ పారదర్శకం గా, వేగవంతంగా పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులకు సహకరించాలని, జనాభా గణన ద్వారా ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు. నగరంలోని ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా స్పందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ పిలుపునిచ్చారు.

# ప్రజావాణికి దరఖాస్తులు నిల్

- పలు శాఖల అధికారులు ప్రజావాణికి డుమ్మా
- ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకన్ గౌడ్



**బొంరాస్ పేట, మే 11 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి దరఖాస్తులు రాలేదని ఎంపీడీవో వెంకన్ గౌడ్ తెలిపారు.ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఏలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రజావాణి కార్యక్రమానికి డుమ్మా కొట్టిన పలు శాఖల అధికారుల తీరుపై సీరియస్ అయ్యారు.ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

# మైనర్ బాలికకు న్యాయం చేయాలి

## బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్



**ఉప్పల్, మే 11 (జనం సాక్షి):** మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మైనర్ బాలిక అని తెలిసి కూడా దారుణానికి పాల్పడటం అత్యంత అమానుషమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలుకనగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోక్సో కేసులో నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇంకా ఎందుకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. సాధారణ వ్యక్తి అయితే వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ కేసులో ఆలస్యం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. బీజేపీ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒక మైనర్ బాలికకు న్యాయం చేయాల్సిన సమయంలో నిందితుడిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోంశాఖను తన ఆధీనంలో ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, కేసును సీరియస్‌గా తీసుకుని నిందితుడిపై చట్టపరమైన చర్యలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం

## ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

**తాండూరు మే 11(జనంసాక్షి )** ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాంమని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. వివిధ రకాలుగా ఆస్పత్రి పాలై చికిత్సలు పొందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ.లక్ష 30 వేల సీఎం ఆర్థిక సహాయ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.తాండూరు పట్టణంలోని అక్షర కోసం రూపాయలు ఇరవై మూడు వేల సీఎం ఆర్థిక సహాయం చెక్కును తండ్రి రమేష్ కు అందించారు. అలాగే యలాల్ మండలం పగిడాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ చికిత్స కొసం భర్తకు రూ. 53 ,000 చెక్కును, బషీరాబాద్ కు చెందిన ఆశా బేగం కుటుంబ సభ్యులకు రూ. 54,000 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు.





అదేవిధంగా చేవెళ్ల లోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జనరల్ హాస్పిటల్ ఎదలకు ఉచిత వైద్యం చేస్తున్నట్లు వివరించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# జన గణన జరిగిందిలా

**అంబర్పేట్ మే11 (జనం సాక్షి )** నేడు అంబర్పేట్ లో జనగణన మొదలైందిఎన్యూ మరేటర్లు తమకు కేటాయించిన లేఅవుట్ మ్యాప్ ను తీసుకుని తమ పరిధిలోని బౌండరీలను తెలుసుకుంటున్నారు తన పరిధిలోని వీధులు స్కూలు, ఆలయాలు ,పార్కులు మొదలగునవి బౌండరీలను గుర్తిస్తున్నారు. అలాగే జిల్లా మరియు మండలం ,గ్రామం మొదలగు వాటిని హౌస్ లిస్టింగ్ బ్లాక్ నెంబర్లను మ్యాప్ తయారు చేసుకున్నారు. ఖాళీ స్థలాలు పొలాలు మొదలగు వాటిని గుర్తిస్తున్నారు. ప్రతి ఇంటికి ఇంటి నెంబర్ను ఎడమవైపు నుండి కుడివైపుకు మరియు పైనుండి కిందికి వేస్తున్నారు. బహులంతస్తులు ఇంటి నెంబర్ తో పాటు ప్లాట్ నెంబర్ను కూడా రాస్తున్నారు ఇంటి ముందు స్పష్టంగా చాక్ పీస్ తో గాని స్టిక్కర్లతో నెంబర్లను రాస్తున్నారు. గూగుల్ మ్యాప్ సహాయంతో బ్లాక్ ను కేటాయించిన ఏరియాను గుర్తిస్తున్నారు,దాని యొక్క పిన్ నెంబర్ను కూడా రాస్తున్నారు . మే 11, 12, 13 ఈ మూడు రోజులు ప్లాన్ ను సిద్ధం చేసుకుంటున్నారు 11న తనకు కేటాయించిన పరిధి గుర్తింపు 12 మే న ఇంటి నెంబర్ల గుర్తింపు మరియు మ్యాప్ ను తయారు చేయడం 13 మే నాడు మిగిలిన ఇల్లు ఖాళీలు మొదలైన వాటిని వెరిఫికేషన్ చేసి తమ సూపర్వైజర్ కు సమర్పిస్తారు.

# ప్రభుత్వం మాది.. అభివృద్ధి చేసే బాధ్యత కూడా మాదే

- తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు ,అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరుగుతున్నాయి
- ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్ మే 11 ( జనం సాక్షి ):** ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని ఆయన అన్నారు. సోమవారం ఉప్పల్ క్రాస్ రోడ్డులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ మరియు కుషాయిగూడ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల అప్‌గ్రేడేషన్ కోసం రూ.37.10 కోట్ల నిధులు మంజూరు చేయించడం సీఎం ప్రత్యేక చొరవ వల్లే సాధ్యమైందని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మవద్దని సూచించిన ఆయన, ఎంత మాయమాటలు చెప్పినా ప్రజలు కాంగ్రెస్ పార్టీనే విశ్వసిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నేరుగా తనను లేదా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులను




సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, కంది ఆగిరెడ్డి, తాఫిక్, బకారం లక్ష్మణ్, రఫీక్, విజయ్, రాజేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, బోపనపల్లి సుధాకర్ రెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, బజారు జగన్నాథ్ గౌడ్, కొంపల్లి బాలరాజ్ ముదిరాజ్, ఈగ ఆంజనేయులు, శ్రవణ్ రెడ్డి, ఆకారపు అరుణ్, లింగంపల్లి రామకృష్ణ, అమరేశ్వరి, ప్రకాష్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన వంట నూనె

## ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్ర శేఖర రెడ్డి

**ఖైరతాబాద్, మే 11 (జనం సాక్షి) :** రైస్ బ్రాన్ ఆయి ల్ చాలా ఆరోగ్యకరమైన నూనె అని ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్, సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్ర శేఖర రెడ్డి సోమవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిష న్‌లో పిహెచ్.డి. కన్సల్టెంట్ ఫుడ్ టెక్నాలజిస్ట్, కన్స ల్టెంట్ న్యూట్రిషనిస్ట్, లైఫ్ కోచ్ అయిన డాక్టర్ రోహి ణి శర్మతో కలసి ఆయన మాట్లాడుతూ ఇంటర్నేష నల్ కాన్ఫరెన్స్ ఆన్ రైస్ బ్రాన్ ఆయిల్-2023లో ఆమె మాట్లాడుతూ రైస్ బ్రాన్ ఆయిల్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను ఎక్కువ మంది తెలు సుకోవాలని అన్నారు. రైస్ బ్రాన్ ఆయిల్‌లో 1:1 నిష్పత్తిలో పూఫా, ముఫా లతో సమతుల్యమైన కొవ్వుల ప్రొఫైల్ ఉంటుందన్నారు. సంతృప్త కొవ్వు ఆమ్లాలు చాలా తక్కువగా ఉంటాయని తెలిపారు. ఇది సహజ యాంటీఆక్సిడెంట్లు అయిన ఒరై జనాల్, టోకోఫెరోల్, టోకోట్రినోల్స్ వంటి న్యూట్రా స్యూటికల్స్‌తో సమృద్ధిగా ఉంటుందని తెలిపారు. రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఉండేగామాఒరైజనాల్,చెడుకొలెస్ట్రాల్(ఎల్డీఎ ల్)నుతగ్గించి,మంచికొలెస్ట్రాల్(హెచ్‌డిఎల్)న ునియంత్రిస్తుందన్నారు. అంతేకాకుండా, రైస్ బ్రాన్ ఆయిల్‌కు అధిక స్మోక్ పాయింట్ ఉంటుందని, అంటే దీనిని భారతీయ గృహాలలో వలె అధిక ఉష్ణోగ్రత వద్ద వంట చేయ డానికి ఉపయోగించవచ్చని పేర్కొన్నారు.ఈ ప్రయ జనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలు రోజువారీ వంట కోసం రైస్ బ్రాన్ ఆయిల్‌ను ఉపయోగించి ఆరోగ్యకరమైన ఎంపిక చేసుకోవాలని మేము సూచిస్తున్నామని అన్నారు.

# అంబేద్కర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులుగా కైర సంపత్



**శామీర్ పేట్, మే 11(జనం సాక్షి )** అలియాబాద్ మున్సిపల్ లాల్ గాడి మలక్ పేట్ అంబేద్కర్ యూత్ అసోసియేషన్ కమిటీనీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కైర సంపత్, ఉపాధ్యక్షులుగా కుకునూర్ రాజు, సీనియర్ సలహాదారులు కైర బాలు, క్యాషియర్ కైర శివా దర్శన్, కన్వీనర్ కైర శ్రీకాంత్, ఆర్గనైజర్లు బత్తుల నరేష్, కైర హరిబాబు, కైర అనిల్, దాసరి వెంకటేష్, కైర నరేష్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కైర యాదగిరి, 6 వ వార్డ్ కౌన్సిలర్ కైర గణేష్, కైర సాయిబాబు, దాసరి సురేష్, కైర గణేష్, కైర రాజు, కైర రాజేందర్, కైర సతీష్, కైర సురేష్, కైర మహేష్, కైర నర్సింగ్ రావ్, కైర ప్రభాకర్, దాసరి సత్యనారాయణ, దాసరి గణేష్, కైర మురళి, కైర సునీల్, కుకునూర్ ఓం ప్రకాష్, కైర చిన్న, కైర అనీష్‌లు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

## ఎన్కేపల్లి గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు కోసిగి సురేందర్





**మోమిన్ పేట మే 11 ( జనం సాక్షి)** కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో మండల స్థాయి అధికారుల ప్రోత్సాహంతో ఎన్కేపల్లి గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తానని ఎన్కేపల్లి గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోసిగి సురేందర్ పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్ సీనియర్ నాయకులు ఎన్ నరోత్తం రెడ్డి ల సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రతి వాడవాడలో సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వీధిలైట్లు డ్వాక్రా భవనము వర్క్ షెడ్లు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టామని వారు తెలిపారు. ప్రస్తుతం ఎన్ఆర్ఈజీఎస్ 10 లక్షల నిధులతో గ్రామంలో సిసి రోడ్డు పనులు పూర్తి చేసామని మిగతా రోడ్డు నిర్మాణం త్వరలో పూర్తి చేస్తానని వారు తెలిపారు. 10 లక్షల రూపాయలతో డ్వాక్రా భవనము, 10 లక్షల రూపాయలతో వర్క్ షెడ్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని ఆయన అన్నారు,10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామపంచాయతీ కార్యాలయం ,దగ్గర నుండి స్మశాన వాటిక వరకు రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. అంగన్వాడి భవన నిర్మాణానికి 12 లక్షలు అవసరం ఉండగా ప్రస్తుతం 8 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించామని మరో నాలుగు లక్షలు త్వరలో మంజూరు అవుతాయని ఆయన తెలిపారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ నిధులు కేటాయిస్తే త్వరలో పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు. గ్రామ ఉపసర్పంచ్ మన్నాన్ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా మండల స్థాయి అధికారుల అందరి సహకారంతో ఎన్కేపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేసే విధంగా కృషి చేస్తున్నానని ఎన్కేపల్లి గ్రామ సర్పంచ్ కోసిగి సురేందర్ తెలిపారు.

# 33% కోటా.. మహిళా లోకానికి ఆశాకిరణం!

## రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు



**ముషీరాబాద్, మే 11 (జనం సాక్షి):** చట్టసభల్లో మహిళలకు 33% వాటా కల్పించడం అనేది దేశాభివృద్ధిలో ఒక కీలక మైలురాయనీ రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్దగల ధర్నాచౌక్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకువచ్చిన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'కు మద్దతునిస్తూ, బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుకన్న మహిళా సాధికారతను నిజం చేస్తూ, గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చారిత్రాత్మకమైన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'ను తీసుకురావడం జరిగిందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ మోడీ తీసుకున్న ఈ నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగ్గ పరిణామ మనీ అన్నారు. ఇది మహిళా లోకానికి దక్కిన గొప్ప అదృష్టంగా మా పార్టీ భావిస్తోందనీ అభివర్ణించారు. అయితే, మహిళలకు ఇంతటి గొప్ప మేలు జరుగుతుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, వారి మిత్రపక్షాలు ఈ బిల్లు పట్ల వ్యవహరించిన తీరు, వారి వ్యతిరేక వైఖరి అత్యంత విచారకరమనీ, ఇది ఆ పార్టీకి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధి లేమిని తెలియజేస్తోందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, మహిళా బిల్లు పట్ల అవలంబించిన వ్యతిరేక విధానాలను అట్టడుగు వర్గాల ప్రజలకు, మహిళలకు తెలియజేయడమే లక్ష్యంగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో, ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన 'రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)' జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రివర్యులు రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఈ బిల్లుకు అనుకూలంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకువచ్చిన చారిత్రాత్మక 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు) పట్ల సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందన్నారు. ఈ ధర్నాకు రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ నాయకులు డాక్టర్ సంఘం శ్రీధర్, రాష్ట్ర నాయకులు దాచారపు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డి రవికుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆర్పీ నీల, పొలిటికల్ ఉమెన్స్ అధ్యక్షులు గంగాపురం పద్మ,పుష్పలత, అనురాధ జగన్నాథం, రాజిరెడ్డి, అసేంట్ ఓనర్ సెక్రెటరీ ఎన్ ఆర్ సి రాజు, ఏఐఆర్ఆర్టీ సెక్రెటరీ నర్సింగ్ రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సాంబ తదితరులు పాల్గొన్నారు.

# దళారుల ఉచ్చులో పడొద్దు

- సన్నారకం వరి క్వింటాలుకు రూ.500 బోనస్
- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి
- పిఏసిఎస్ చైర్మన్ జయకృష్ణ



**బొంరాస్ పేట, మే 11 (జనం సాక్షి):** రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్మి మోసపోవద్దని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు.సోమవారం పిఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సన్నరకం, బురాన్ పూర్ గ్రామంలో దొడ్డు రకం వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వడ్లను ఆరబెట్టుకొని తేమశాతం ఉండేలా చూసుకోవాలన్నారు.రైతులు పండించిన వరి ధాన్యానికి ఏ గ్రేడు రూ 2,389, సాధారణ రకం రూ.2,369 క్వింటాలకు ధర చెల్లిస్తుందన్నారు. సన్న రకం వడ్లు క్వింటాలుకు రూ .500 బోనస్ అదనంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్, ఏఎస్ఎస్ వైస్ చైర్మన్ కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, బురాన్ పూర్ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, ఉప సర్పంచ్ సంగమేశ్, పిఏసిఎస్ డైరెక్టర్లు, కొనుగోలు కేంద్రం ఇంచార్జి కృష్ణ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గృహ గణన - ప్రగతికి బాట

## మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి



**తాండూరు మే 11 (జనంసాక్షి)** తాండూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జన గణన -2027 ను తాండూర్ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మ్యాపింగ్, నెంబర్ రింగ్ చేసే విధానాన్ని ఎనీ మారేటర్ ని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ అభివృద్ధి కోసం జనాభా గణన లో భాగంగా ఇండ్ల వివరాలు, సౌకర్యాలకు సంబంధించి పకడ్బందీగా చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ నరేందర్ రెడ్డి, సూపర్వైజర్ అనిల్ కుమార్, వార్డ్ కౌన్సిలర్, బిల్ కలెక్టర్, వార్డ్ ఆఫీసర్లు ఉన్నారు.

# శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబం



**తాండూరు మే 11(జనంసాక్షి)** కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వామి ఆశీస్సులు తాండూరు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు.

# ఉప్పల్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోరు

## ఆధ్యాత్మిక, విద్యా కార్యక్రమాల్లో బిజీబిజీ




**ఉప్పల్, మే 11 ( జనం సాక్షి ):** ఉప్పల్ నియోజకవర్గంలో ఆదివారం పలు ఆధ్యాత్మిక, విద్యా, సామాజిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. దేవాలయ వార్షికోత్సవాల నుంచి విద్యార్థుల ప్రతిభా సత్కారాల వరకు జరిగిన ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ఆధ్యాత్మిక, విద్యా అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. మొదటగా చిలుకనగర్ గుట్టపై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన చతుర్థ వార్షికోత్సవ మహోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైశాఖ మాస బహుళ అష్టమి సందర్భంగా ప్రారంభమైన ఈ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వేద మంత్రోచ్చారణల నడుమ వైభవంగా సాగాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆరాధన, గణపతి పూజలు, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణం, పంచామృత ఏకాదశ మన్యుసూక్త అభిషేకం, సహస్ర తమలపాకులతో సహస్రనామార్చన, మన్యుసూక్త హవనం వంటి విశిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామివారి ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. స్వామివారి దివ్య దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. యువత ఆధ్యాత్మికత వైపు మళ్లి మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని శ్రీమతి ఒ శ్రీ గుడి వినోద్ సరోత్తంరెడ్డి, శ్రీమతి ఒ శ్రీ గుడి స్వర్ణ మధుసూదన్ రెడ్డి దంపతులు సేవాభావంతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉప్పల్‌లో నిర్వహిస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవ కార్యక్రమాలకు కూడా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మే 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న వివిధ విద్యా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల వివరాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి వారోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో కూడా రాణించాలని సూచించిన ఎమ్మెల్యే, పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసం అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఎడ్యుకేషన్ వీక్" కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థుల విజయాలు ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.18 కోట్ల నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల అధ్యాపకులు, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, విద్యా, అభివృద్ధి కార్యక్రమాలు ఒకేసారి ఉత్సాహంగా కొనసాగుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

## లక్ష్య దిశగా విద్యార్థులు..ఉన్నతంగా ఎదగాలన్న ఎంసి పల్లి చైర్మన్ జాం రవి

**శామీర్ పేట్, మే 11(జనం సాక్షి )** లక్ష్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా సమ్మర్ క్యాంప్‌ను స్థానిక మున్సిపల్ చైర్మన్ జాము రవి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యా యురాలు శారదా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల సహకారం, ఉపాధ్యాయుల కృషి తో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు అని తెలిపారు.విద్యార్థుల సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం మరియు నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఈ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. క్యాంప్‌లో డ్రాయింగ్, మరియు పెయింటింగ్, యోగా, ఇంగ్లీష్ గ్రామర్, స్టోరీ టెల్లింగ్, వ్యక్తిత్వ వికాసం, వోకల్ మ్యూజిక్, కంప్యూటర్ బేసిక్స్ వంటి పలు అంశాలలో ప్రత్యేక శిక్షణ అందించ నున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ..విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని కొత్త విషయాలు నేర్చుకుని తమ ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకోవాలి. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా ఎంతో ముఖ్యమైనదని అన్నారు. పదవి ఉన్నా లేకపోయినా విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాను. విద్యార్థులకు అన్ని విధాలుగా చేయూతనిస్తాను అని తెలిపారు. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించి, వారికి ప్రోత్సాహక బహుమతులు త్వరలో అందజేస్తామని ప్రకటించారు.యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు,




పాఠశాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. లక్ష్మా పూర్‌లో ప్రీ-ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ భాగ్యమణి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయు రాలు శారదా రాజ్యలక్ష్మి, స్థానిక కౌన్సిలర్ సరిత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, గ్రామ యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ, నాయకులు గోపాల్, శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, ఆకుల భూపాల్, పాఠశాల కమిటీ చైర్మన్ సాంబలక్ష్మి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎండల వేళ చల్లని ఊరట

- వేసవిలో ప్రతి జీవికి నీళ్ళే ఆధారం
- 8వ వార్డు సభ్యుడు ఇఫాయత్ ను అభినందించిన
- కేసారం గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య

**మోమిన్ పేట మే 11 ( జనం సాక్షి)** ప్రజల దహార్తిని తీర్చడం సంతోషకరమైన విషయమని కేసారం గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య అన్నారు. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని కేసారం గ్రామ బస్టాండ్ సమీపంలో 8వ వార్డు సభ్యులు ఇఫాయత్ ప్రజల దాహార్తిని తీర్చాలనే సదుద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమైన విషయమని గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య ఆయనను అభినందించారు. వివిధ గ్రామాల ప్రయాణికులు త్రాగునీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కునేవారని స్పష్టం చేశారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు మంచినీటినీ తాగి చలి వేంద్రాన్ని ఏర్పాటుచేసిన ఇఫాయత్ ను అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలను పొందే ప్రయత్నం చేయాలని ప్రజలు అన్నారు.



# ప్రారంభమైన విద్యా వారోత్సవాలు

**సైన్స్ లాబ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి**





**బొంరాస్ పేట,11 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాలు సోమవారంఘనంగాప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం సమ్మర్ క్యాంపు లో భాగంగా విద్యార్థులకు క్యారమ్స్ గేమ్స్ పోటీలు ప్రారంభించారు. మండల కేంద్రం నుండి హైదరాబాదులోని లాల్ బహదూర్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమానికి 60 మంది విద్యార్థులు, 13 మంది ఉపాధ్యాయులు, ఏడుగురు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరసింహులు గౌడ్, పిఎస్సిఎస్ చైర్మన్ జయకృష్ణ, ఎంఈఓ హరిలాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, గ్రామ సర్పంచ్ వీరేశలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి కళాశాలలో విద్యా సంబరాలు




**మల్కాజిగిరి మే 11(జనంసాక్షి)** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బండి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా ప్రమాణాల పెంపుదలపై అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. గత ఏడాది భవన నిర్మాణం కోసం 2.5 కోట్లు సాధించామని, మలబార్, అజీమ్ ప్రేమ్‌జీ వంటి సంస్థల నుండి సీఎస్ఆర్ నిధులు సేకరించి విద్యార్థుల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కొరత ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని ఉత్తమ ప్రభుత్వ కళాశాలల సరసన నిలవడం గర్వకారణమన్నారు. ఉన్న వనరులను సమర్థవంతంగా వాడుకోవాలని డా. వెంకట్ రెడ్డి, మహిళా సాధికారతపై దృష్టి పెట్టాలని స్వాతి సూచించారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన నైపుణ్య విద్యను అందించాలని ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాజేశ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన అకాడమిక్ అల్మనాక్ ఉండాలని డా. బ్రిజేశ్, ఒత్తిడిలోనూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని గుణాకర్ సూచించారు. అడ్మిషన్ల ప్రచారంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అహల్య, మీనయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. అడవి రాజు, సీనియర్ అధ్యాపకులు మల్లిక, శైలజ, యాదగిరి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన గృహ సర్వే షురూ..



**బొంరాస్ పేట, మే 11 ( జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి మండల పరిధిలో జనగణన గృహ సర్వే ప్రారంభమైంది. మండల కేంద్రంలో సూపర్వైజర్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్ని మారేటర్లు మల్లయ్య, చంద్రశేఖర్, సుధాకర్ ,సుశీల ,రిజ్వానా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్, స్థానిక సర్పంచి వీరేశలింగం ఇళ్ల వద్ద వివరాలు సేకరించారు.

# సొంత ఖర్చుతో గ్రామ దాహార్తిని తీర్చిన దాత

- అమ్మాయి పెళ్లికి పట్టుచీర, 5వేల రూపాయల కానుక
- అంత్యక్రియల నిమిత్తం 12 వేల రూపాయల ఆర్థిక సహాయం
- స్పీకర్ సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా
- ఇజ్రా చిట్టంపల్లి గ్రామ సర్పంచ్ నేనావత్ వందన విజయ్ కుమార్





**మోమిన్ పేట మే 11 (జనం సాక్షి)** మోమిన్ పేట మండలంలోని ఇజ్రా చిట్టంపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నీటి సమస్య ఉండేదని తమ స్వంత డబ్బులతో మూడు బోర్లు వేయించి గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కారం చేశానని గ్రామ సర్పంచ్ నేనావత్ వందన విజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఇజ్రా చిట్టంపల్లి గ్రామ సర్పంచ్ నేనావత్ వందన విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో నాలుగు లక్షల స్వంత డబ్బులతో మూడు బోర్లు వేయించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చానని అన్నారు. 10 లక్షల నిధులతో డ్వాక్రా భవన నిర్మాణ పనులను, మరో 10 లక్షలతో వర్క్ షెడ్ నిర్మాణ పనులను ప్రారంభించామని వారు తెలిపారు. రైతుల సౌకర్యం కోసం గుట్ట నుండి శివాలయం వరకు ఫార్మేషన్ రోడ్డు వేయించానని అన్నారు. సి సి రోడ్డు నిర్మాణ పనుల కోసం ఎన్ఆర్ఈజీఎస్ 5 లక్షల నిధులు మంజూరయ్యాయని త్వరలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో అమ్మాయి పెళ్లికి పట్టుచీర, 5 వేల రూపాయల కానుక అందజేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం 12 రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే శంకర్ యాదవ్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుభాష్ సహకారంతో గ్రామానికి అధిక నిధులు తీసుకువచ్చి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ఆదర్శ గ్రామంగా ఇజ్రా చిట్టంపల్లి గ్రామాన్ని తయారు చేసే ప్రయత్నం చేస్తానని అన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కదిలిరండి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపు**



**మల్కాజిగిరి మే 11 (జనంసాక్షి)** బీఆర్ఎస్ పార్టీ లో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గోపాల్ నగర్ కమిటీ హాల్ లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, మల్కాజిగిరి నియోజకవర్గం లోని అన్ని డివిజన్లో బీఆర్ఎస్ పార్టీ నూతన కమిటీ ఏర్పాటులకు కృషి చేస్తున్నామన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ నాయకులు కార్యకర్తలు కమిటీ ఏర్పాట్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రతి కార్యకర్త ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నంది కంటి శ్రీధర్, గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్, మేకల రాము యాదవ్, మల్కాజ్గిరి నియోజకవర్గ కమిటీ ప్రతినిధులు జేఏసీ వెంకన్న, మహమ్మద్ ఖలీల్, రావుల అంజయ్య, పరశురాంరెడ్డి వీరేశం యాదవ్, బైరు అనిల్,కృష్ణ గౌడ్,సిద్ధిరాములు ,రామచర్ల నర్సింగ్, మర్రి శీను, హబీబ్, సిహెచ్ వెంకట్, భరత్, సిద్ధులు, సుధామ తదితరులున్నారు.

# తక్షణమే అరెస్టు చేయాలి.. లేదంటే ఆందోళనలు తప్పవు

**చట్టం ఎవరికైనా ఒక్కటే.. బండి సాయి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి**



**మోమిన్ పేట మే 11 (జనం సాక్షి)** బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశానుసారం మండల పార్టీ అధ్యక్షులు దబ్బని వెంకట్ పిలుపు మేరకు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర హోం సహాయం మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మోమిన్ పేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ సమావేశాన్ని ఉద్దేశించి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొరంగపల్లి కృష్ణ యువ నాయకులు అభిషేక్ మాట్లాడుతూ బండి సాయి భగీరథ్ 17 ఏళ్ల మైనర్ బాలికను అత్యాచారం చేసి తప్పించుకుని తిరుగుతున్న కేంద్ర సహాయ మంత్రి అయిన బండి సంజయ్ తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని అంటున్న సంజయ్ కేంద్ర హోం సహాయ మంత్రి పదవికి అనర్హుడని వెంటనె రాజీనామా చేసి తన కొడుకును పోలీసులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.. లేనిపక్షంలో టిఆర్ఎస్ పార్టీ పక్షాన నిన్ను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.. అదేవిధంగా రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్న తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్లో మాట్లాడిన సందర్భం ఒక్కటి కూడా లేదు అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అగమ్య గోచరంగా ఇప్పటికి కూడా హోంమంత్రి లేకపోవడం విడ్డూరమని వారు అన్నారు. రాష్ట్రంలో ఇంత ఘోరంగా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్న బిజెపి మహిళా ఎమ్మెల్యేలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మహిళా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పందించకపోవడం శోచనీయం దీనిని బట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్ ఇద్దరు కుమ్మక్కయ్యారని లేనిపక్షంలో నరేంద్ర మోడీ స్పందించి బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు గుజ్జరి కృష్ణయ్య అరుణ బిచ్చయ్య సీనియర్ నాయకులు మొహమ్మద్ అబ్బాస్ ఆగమయ్య రవి కుమార్ మంగలి రాజు అబ్రహం సందీప్ యువ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రగతి బాటలో మరో అడుగు

- చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో రూ.1.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అభివృద్ధిలో నంబర్-1గా చిల్కానగర్ డివిజన్
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, మే 11 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలోని చిల్కానగర్ మరియు బీరప్పగడ్డ డివిజన్లలో రూ.1 కోటి 48 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. డివిజన్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కాలనీకి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో సీసీ రోడ్లు, వర్షపు నీటి కాలువలు, భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ మరియు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రూ.1.48 కోట్ల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పైప్‌లైన్లు, వర్షపు నీటి కోసం స్టార్మ్ వాటర్ డ్రెన్ ట్రంక్ లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు మెరుగుపర్చడమే తమ లక్ష్యమన్నారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బ్యాంక్ కాలనీలో ఆటోస్టాండ్ నుంచి ఫణి మెడికల్ షాప్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెన్ పైప్‌లైన్ పనులు, ఆటోస్టాండ్ నుంచి వార్డు కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అలాగే సాయిరాం నగర్ కాలనీలో డ్రైనేజ్ పైప్‌లైన్ పనులు ప్రారంభించామని, కళ్యాణ్‌పురిలో కూడా డ్రైనేజ్ పనులకు ఎమ్మెల్యే చొరవతో శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అభివృద్ధి పనుల రూపంలో అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు సూచించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, వీబీ నరసింహ, జల్లి మోహన్, బాలకృష్ణ గౌడ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, మాస శేఖర్, రామాంజనేయులు, శ్యాం బంటి, ఒబేద్ తదితరులు పాల్గొన్నారు. సాయిరాం నగర్, బ్యాంక్ కాలనీ, కళ్యాణ్‌పురి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బస్తీవాసులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ప్రజావాణికి 28 ఫిర్యాదులు

## తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశం



**మల్కాజిగిరి, మే 11 (జనం సాక్షి)** మల్కాజిగిరి జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం ద్వారా వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 28 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కీసర సర్కిల్ నుండి ఇంజనీరింగ్ 7, అల్వాల్ 2, మౌలాలి 2, మల్కాజిగిరి సర్కిల్ 2 మొత్తం 13 ఫిర్యాదులు, రెవెన్యూ బోయిన్పల్లి సర్కిల్ 2 మౌలాలి సర్కిల్ 2 మొత్తం 4 ఫిర్యాదులు, టౌన్ ప్లానింగ్ కీసర సర్కిల్ 3 బోయిన్పల్లి సర్కిల్ 1 మౌలాలి సర్కిల్ 1 మల్కాజిగిరి సర్కిల్ 4 మొత్తం తొమ్మిది ఫిర్యాదులు, ఎలక్ట్రికల్ కీసర సర్కిల్ 1, యుబిడి మౌలాలి సర్కిల్ 1 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సంచిత్ గాంగ్వార్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన 28 లో ప్రతి ఒక్క ఫిర్యాదు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత కాలపరిమితిలోగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, టౌన్ ప్లానింగ్ అధికారి బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలి

## బిఆర్ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్



**ముషీరాబాద్, మే 12 (జనం సాక్షి):** హనీ ట్రాప్ అని బుకాయించకుండా తన కొడుకు చేసిన తప్పుకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి భేషరతుగా రాజీనామా చేయాలనీ, లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వమే బండి సంజయ్ ను తన పదవి నుంచి భర్త రఫ్ చేయాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇందిరాపార్క్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలిక కు మద్యం తాగించి అత్యాచారం చేసిన ఘటనలో ఫోక్సో కేసు నమోదైనప్పటికీ సాధారణ ప్రజలకు ఒక న్యాయం, మంత్రి కొడుకుకు ఒక న్యాయం అన్న చందంగా పోలీసులు వ్యవహరిస్తున్నారనీ, కేసు నమోదైనప్పటికీ అతని అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కేసును దారి మళ్లించేందుకే హనీ ట్రాప్ కింద కేసు నమోదు చేసి చేతులు దులుపుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని, కేసును నిర్వీర్యం చేసి బిజెపి కాంగ్రెస్ ఒక్కటే అనే నినాదాన్ని నిజం చేశారన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ లు బాలికకు మద్దతుగా ఒక్క మాట మాట్లాడకపోవడం దారుణమన్నారు. కేసును తప్పుదారి పట్టించేందుకు ఫోక్సో చట్టం కింద నమోదైన కేసును హనీ ట్రాప్ కింద చూపించి తన కొడుకును కాపాడుకోవడానికి బండి సంజయ్ చేస్తున్న కుట్రలు సిగ్గుచేటని నగేష్ ముదిరాజ్ ఆరోపించారు. తక్షణమే బండి సాయి భగీరథ ను పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కాలనీవాసుల వినతి



**మల్కాజిగిరి మే 11(జనంసాక్షి)** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని బలరాం నగర్ డివిజన్ భగత్ సింగ్ నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరుతూ కాలనీ వాసులు సోమవారం వాటర్ వర్క్స్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జీఎం సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేసి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుపాకుల జనార్దన్ మాట్లాడుతూ. కాలనీలో డ్రైనేజీ సమస్య వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే సూచనతో అధికారులను కలిసి సమస్య వివరించినట్లు తెలిపారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు లింగమయ్య, కృష్ణమూర్తి, దేవప్రసాద్, శ్రీధర్, వేణు, శ్రీకాంత్, దాస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతమే సీఎం లక్ష్యం

## నాడు-నేడు తరహాలో సర్కారు బడుల అభివృద్ధి.. పరమేశ్వర్ రెడ్డి హర్షం



**కాప్రా, మే 12 (జనం సాక్షి):** రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పాఠశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి గారు ఎంతగానో కృషి చేస్తున్నారని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్, కుషాయిగూడ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలు అప్‌గ్రేడెషన్ కోసం రూ.37.10 కోట్ల నిధులను మంజూరు చేయించినట్టుగా సందర్భంగా సోమవారం ఈసీఐఎల్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత ప్రచారం చేసుకున్నా, ఎన్ని రకాల మాయమాటలు చెప్పిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌రెడ్డి నే నమ్ముతారని ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి ,సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి ,పావని రెడ్డి ,స్వర్ణరాజ్ శివమణి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజి రెడ్డి ,సీత రామ్ రెడ్డి ,రాజేందర్ ,కాప్రా, చర్లపల్లి ,మల్లాపూర్, ఏ ఎస్ రావు నగర్,మీర్పేట్ హెచ్ బి కాలనీ అధ్యక్షులు నాగ శేషు ,కాశెట్టి ప్రసాద్ ,పోలేపక అంజయ్య ,కప్రా సాయి గౌడ్,వెంకట్ రెడ్డి జిల్లాకార్యవర్గ సభ్యులు దండల్లా మురళి ,సురేష్,పాకాల రాజు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్,పూర్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తులసి రమణాచార్యులకు ఘన సన్మానం



**మల్కాజిగిరి మే 11(జనంసాక్షి)** సాహితీ సేవా సమితి (పాలెం) ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్ వైష్ణవ సేవా సదనంలో మల్కాజిగిరి కి చెందిన ప్రముఖ కవి, అర్చకులు డాక్టరు తులసి వెంకట రమణాచార్యులను ఘనంగా సన్మానించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆచార్య మసన చెన్నప్ప గారి రచనలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయనకు ఈ గౌరవం లభించింది.సంస్థ అధ్యక్షులు కండ్లకుంట శేషాచార్యులు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డా. రమణాచార్యులతో పాటు వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన కండ్లకుంట వెంకట నరసింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, డా. కె.ఎల్.ఎన్. చార్యులు, కెవిఎన్. చార్యులు, ముడుంబై కృష్ణమాచార్యులు, వేదాంతం మురళీధర్, కె. సుమన మౌన్యలను సత్కరించారు. ప్రతిభావంతులను గౌరవించడం వల్ల భావితరాలకు స్ఫూర్తి లభిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# పారదర్శకంగా ఆటగాళ్ల ఎంపిక చేస్తాం

- హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ అధినేత అంబటి రాయుడు
- ఉప్పల్‌లో కీలక నిర్ణయాలు ప్రకటించిన అంబటి రాయుడు
- యువ క్రికెటర్లకు భారీ అవకాశం.. త్వరలో ఓపెన్ ట్రయల్స్ నిర్వహణ




**ఉప్పల్, మే 11 (జనం సాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో క్రికెట్ ఆపరేషన్స్ అధినేతగా బాధ్యతలు స్వీకరించిన మాజీ భారత క్రికెటర్ అంబటి రాయుడు ఉప్పల్‌లో కీలక నిర్ణయాలు ప్రకటించారు. తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి కొత్త దిశగా అడుగులు వేస్తున్నామని, ముఖ్యంగా ప్రతిభ కలిగిన యువ ఆటగాళ్లకు న్యాయం జరిగే విధంగా ఎంపిక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉప్పల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన అంబటి రాయుడు, రాబోయే క్రికెట్ లీగ్‌లు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఆటగాళ్ల ఎంపికలో ఎలాంటి సిఫారసులు, రాజకీయాలు, పక్షపాతాలకు తావు ఉండదన్నారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఆటగాళ్లను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. నిజమైన టాలెంట్‌కు అవకాశం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతోమంది ప్రతిభావంతులైన యువ క్రికెటర్లు వెలుగులోకి రావాల్సి ఉందని, సరైన అవకాశాలు లేక చాలామంది వెనుకబడిపోతున్నారని రాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై అలాంటి పరిస్థితులు లేకుండా యువతకు నేరుగా అవకాశాలు కల్పించే విధంగా హెచ్‌సీఏ పనిచేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో త్వరలోనే "ఓపెన్ ట్రయల్స్" నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి యువ ఆటగాళ్లు పాల్గొనేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ ట్రయల్స్ ద్వారా ఎంపికయ్యే ప్రతిభావంతులైన ఆటగాళ్లకు ప్రొఫెషనల్ శిక్షణ, మెరుగైన కోచింగ్, రాష్ట్ర స్థాయి పోటీల్లో అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. క్రికెట్‌ను కేవలం నగరాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాలన్నదే తమ లక్ష్యమని రాయుడు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల స్థాయిలో కూడా యువ ఆటగాళ్లను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలు చేపడతామని అన్నారు. తెలంగాణ నుంచి భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లు రావాలని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో పారదర్శకత, క్రమశిక్షణ, నిష్పక్షపాత విధానాలకు పెద్దపీట వేస్తామని ఆయన స్పష్టం చేశారు. క్రికెట్ పరిపాలనలో మార్పులు తీసుకువచ్చి ఆటగాళ్లకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ఉప్పల్ క్రికెట్ అభిమానులు, యువ ఆటగాళ్లు అంబటి రాయుడు నిర్ణయాలను స్వాగతిస్తూ, తెలంగాణ క్రికెట్‌కు ఇది మంచి పరిణామమని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ యువతకు తమ ప్రతిభ నిరూపించుకునే వేదిక లభించబోతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు..

# విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం

## సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించిన చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి



**చేవెళ్ళ, మే 11 (జనంసాక్షి)** పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల చేవెళ్ళలో సోమవారం సమ్మర్ క్యాంప్ ను (వేసవి శిక్షణ శిబిరం) చేవెళ్ళ మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా రెడ్డి, మండల విద్యాధికారి పురందాస్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. పిల్లలు మొబైల్స్ దూరంగా ఉండాలని సృజనాత్మకతను పెంపొందించుకొని కొత్త నైపుణ్యాలు నేర్చుకోవలని అన్నారు. చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, యోగా, కరాటే, కంప్యూటర్ శిక్షణ, పర్సనాలిటీ డెవలప్మెంట్, సైన్స్ ప్రయోగాలు, క్విజ్ మొదలైన అంశాలు పిల్లలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కౌన్సిలర్ మద్దెల శ్రీను మాట్లాడుతూ.. చిన్నతనంలో ఇలాంటి అవకాశాలు మాకు లేకుండే ఇప్పుడున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల విద్యాధికారి పురందాస్ మాట్లాడుతూ..మొదటి రోజే క్యాంప్ లో దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని వారికి అల్పాహారం అందించామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలోని 6వ తరగతి నుండి 9 వ తరగతి చదివే విద్యార్థులు ఎవరైనా ఇంకా ఈ క్యాంప్ లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. విద్యార్థి పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ చిన్నప రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# పేదింట ఇందిరమ్మ ఇండ్ల వెలుగులు

## తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



ధారూర్ మే 11(జనంసాక్షి) ధారూర్ మండల కేంద్రంలో లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న రెండు ఇందిరమ్మ ఇళ్లను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ప్రారంభించి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులను అభినందించిన స్పీకర్, ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.పథకం అమలులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు.అధికారులు,లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నినాదం 'బేటీ బచావో' కాదు.. 'బేటా బచావో'గా మారింది!

- మైనర్ బాలికపై హత్యాచారం చేసిన సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి.
- బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి
- బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల




**బోడుప్పల్-జనంసాక్షి** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల మాట్లాడుతూ... "బేటీ బచావో" అంటూ దేశవ్యాప్తంగా నినాదాలు ఇచ్చే బీజేపీ, ఇప్పుడు "బేటా బచావో" విధానాన్ని అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. మైనర్ బాలికపై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటికీ, నిందితుడు సాయి భగీరథ్‌ను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైందన్నారు. చట్టం అందరికీ సమానమైతే అధికార పార్టీల నేతల కుటుంబాలకు మాత్రం ఎందుకు మినహాయింపు ఇస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ... దేశం కోసం, ధర్మం కోసం అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బండి సంజయ్, ఇప్పుడు తన కుమారుడిని కాపాడేందుకు అధికారాన్ని ఉపయోగిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు. "బేటీ బచావో" నినాదాన్ని "బేటా బచావో"గా మార్చినట్టుగా పరిస్థితి కనిపిస్తోందన్నారు. బాధితురాలి 164 జబ్తీజ స్టేట్మెంట్ ఇప్పటివరకు నమోదు చేయకపోవడం కూడా చట్టపరమైన నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రాష్ట్ర డీజీపీ స్థాయి మహిళా అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి, హైకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్ మాట్లాడుతూ... బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు గంటల తరబడి స్వీకరించకపోవడం, ఫిర్యాదును మార్చమని ఒత్తిడి తేవడం, కేసు వెనుక పెద్దలు ఉన్నారని చెప్పడం వంటి ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. న్యాయం కోసం బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ ముందు వేడుకోవాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి సభలో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన తర్వాతే ఫిర్యాదు స్వీకరించడం దురదృష్టకరమన్నారు. పోక్సో చట్టం ప్రకారం మైనర్ బాలిక సమ్మతి చెల్లదని, అయినప్పటికీ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకుండా బాధితురాలిపైనే కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరించే ప్రయత్నాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ కొడె పోచయ్య మాట్లాడుతూ... ఈ కేసులో పేట్ బషీరాబాద్ పోలీసుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నిందితుడికి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, వారి కాల్ డేటాను విచారించాలని కోరారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంలోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని నిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ కేసును మీడియా దృష్టికి రాకుండా దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. "హనీ ట్రాప్" పేరుతో అసలు అంశాన్ని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, మహిళల భద్రతపై మాట్లాడే నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయ ప్రయోజనాల కోసం కేసును బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, నాయకులు ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, గడీల జగన్ రెడ్డి, శ్యామల శ్రీనివాస్, పాశం నరేందర్ రెడ్డి, పుల్ల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్, నర్సిరెడ్డి, కళ్యాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర డాక్టర్ల బృందానికి ధన్యవాదాలు

## బిజెపి మెడికల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**వికారాబాద్ మే 11,(జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వైద్య విభాగం ఆధ్వర్యంలో, నరేంద్ర మోదీ బహిరంగ సభకు ఘన స్వాగతం పలికేందుకు మరియు తమ మద్దతును చాటుకునేందుకు వైద్యులు, వైద్య విద్యార్థులు కలిసి భారీ ర్యాలీలో పాల్గొనడం జరిగిందని. తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీజీ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 800 మంది డాక్టర్లు, మరియు 600 మంది వైద్య సిబ్బంది విద్యార్థులు హాజరై అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారన్నారు అదేవిధంగా, భారతీయ జనతా పార్టీ ధార్మిక విభాగం ఆధ్వర్యంలో, దాదాపు 250 మంది సాధువులు, ఋషులు మరియు ఆచార్యులు శ్రీ నరేంద్ర మోదీ గారి బహిరంగ సభకు తమ మద్దతును తెలియజేస్తూ పరేడ్ గ్రౌండ్స్ వరకు నిర్వహించిన ర్యాలీ సక్సెస్ గా జరిగింది ఈ కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర మెడికల్ సెల్ కమిటీకి కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

# నామాలగుండులో అఖిల్ హత్యపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు

### వి వాంట్ జస్టిస్ అంటూ భారీ ర్యాలీ




**సికింద్రాబాద్, (జనం సాక్షి):** సీతాఫల్‌మండి పోలీస్ స్టేషన్ పరిధిలోని నామాలగుండులో ప్రేమ వ్యవహారానికి సంబంధించిన వివాదంలో దారుణంగా హత్యకు గురైన యావన్ అలియాస్ అఖిల్ ఘటన నగర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది. బీటెక్ విద్యార్థి అయిన అఖిల్‌ను అతి కిరాతకంగా నరికి చంపిన ఘటనపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు పది మందిని అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నప్పటికీ, నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అఖిల్‌కు న్యాయం చేయాలని కోరుతూ నామాల గుండు, సీతాఫల్‌మండి, వారాసిగూడ ప్రాంతాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. యువత, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని "వి వాంట్ జస్టిస్", "అఖిల్‌కు న్యాయం చేయాలి", "హంతకులను ఉరితీయాలి" అంటూ నినాదాలు చేశారు. చేతుల్లో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని యువత ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ర్యాలీ దారి పొడవునా నినాదాలతో ప్రాంతమంతా మారుమోగింది. కొంతమంది యువకులు ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రేమ పేరుతో యువకుడిని కిరాతకంగా హత్య చేయడం అమానుషమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ర్యాలీలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బస్తీ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. అఖిల్ కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. యువత ప్రాణాలతో ఆటలాడే నేరస్తులపై చట్టం మరింత కఠినంగా వ్యవహరించాలని నాయకులు డిమాండ్ చేశారు. అఖిల్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని ర్యాలీలో పాల్గొన్న వారు కోరారు. భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో నామాలగుండు, సీతాఫల్‌మండి, వారాసిగూడ ప్రాంతాలు నినాదాలతో మారుమోగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు.



# మణికొండ వార్డులో జోనల్ కమిషనర్ విస్తృత పర్యటన

**రాజేంద్రనగర్,మే11(జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్ మణికొండ వార్డులో "వన్ వార్డ్ ఎవరీ డే" కార్యక్రమంలో భాగంగా సిఎంసీ కమిషనర్ విస్తృత స్థాయి ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, సైబరాబాద్ కమిషనర్ శ్రీజన, డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొని స్థానిక ఆర్‌డబ్ల్యూఏలు, నివాసితులతో ప్రత్యక్షంగా మాట్లాడి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.పర్యటనలో వర్షపు నీటి నిల్వలు, ఎస్ఎన్‌డీపీ నాలా పనుల ఆలస్యం, పాండెం వాగు పనుల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు, హుడా కాలనీలో డ్రైనేజ్ , యూజీడీ సమస్యలు, బీటీ రోడ్లు, అంతర్గత రహదారి పనులు, ట్రాఫిక్ సమస్యలు, ఫుట్‌పాత్‌లు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రాపర్టీ ట్యాక్స్ అంచనాలకు సంబంధించిన ఫిర్యాదులను కూడా నివాసితులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

అబ్దుల్ కలాం పార్క్, మహాత్మా గాంధీ పార్క్, పంచమంతి పార్కులలో నిర్వహణ, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, చెత్త తొలగింపు, పారిశుద్ధ్య బలోపేతం, వాచ్‌మన్ గది, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి అవసరాలను కమిషనర్ పరిశీలించారు. పార్కుల సమీపంలో వీధి వ్యాపారాల నియంత్రణపై కూడా స్థానికులు విజ్ఞప్తి చేశారు. వెంకటేశ్వర కాలనీలో డ్రైనేజ్ కనెక్టివిటీ సమస్యలు, నాలాల ఆక్రమణలు, వర్షపు నీటి పారుదల సమస్యలపై చర్చించగా, కాలనీలు మరియు ఇళ్లలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ ఏర్పాటు అవసరాన్ని అధికారులు ప్రస్తావించారు. అదనంగా మణికొండలో సమగ్ర మార్కెట్ ఏర్పాటు, వృద్ధుల కోసం లైబ్రరీ నిర్మాణం, వాణిజ్య కార్యకలాపాల నియంత్రణ వంటి డిమాండ్లు నివాసితులు కమిషనర్‌కు వినిపించారు.పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ వ్యవస్థ, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణపై సమీక్ష నిర్వహించిన కమిషనర్ సంబంధిత శాఖలకు పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, విభాగాల మధ్య సమన్వయం పెంచాలని, నిరంతర పర్యవేక్షణతో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# గ్రామీణ నిరుద్యోగ యువతకు ఐక్యత పౌండేషన్ చేయూత

- **పోలీస్ ఉద్యోగానికై శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ**
- **ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**తలకొండపల్లి మే11(జనంసాక్షి):**
ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రంలో సోమవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి గారు మాట్లాడుతూ..ఉద్యోగం కోసం ప్రయత్నించే ప్రతి యువకుడి వెనుక ఒక కుటుంబం కల ఉంటుంది,ఆ కల నెరవేరాలంటే కేవలం కోచింగ్ తో పాటు,నిరంతరం చదవడం,పరీక్షలపై అవగాహన పెంచుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం చాలా అవసరం అని తెలిపారు, చాలా మంది విద్యార్థులు ప్రతిభ ఉన్నప్పటికీ సరైన సదుపాయాలు, వనరులు లేక ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉండడం చాలా అవసరం,అందుకే అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు, పోలీస్ ఉద్యోగం అనేది కేవలం వ్యక్తిగత విజయమే కాదు కుటుంబానికి గౌరవం తీసుకువచ్చే బాధ్యతాయుతమైన స్థానం,అందుకే ప్రతి అభ్యర్థి సమయపాలన,క్రమశిక్షణ అలవాటు చేసుకుని లక్ష్యంపై దృష్టి పెట్టాలి,కష్టపడిన వారికి తప్పకుండా మంచి ఫలితం వస్తుంది అని,శిక్షణ పొందుతున్న వారందరూ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరు ఉద్యోగాన్ని సాధించాలని ఆకాంక్షించారు.అంతకముందు శిక్షణ పొందుతున్న విద్యార్థులు మాట్లాడారు.ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణను అందించి మెటీరియల్ పంపిణీ చేసి,మాకు మరింత తోడ్పాటును అందిస్తూ,ప్రోత్సహిస్తున్న సుంకిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ బృందంతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి వర్ధంతి

**అల్వాల్, మే 11 (జనంసాక్షి):** మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి ఏడవ వర్ధంతిని నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనకారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గానికి చేసిన సేవలను, మధుర స్మృతులను నేతలు గుర్తు చేసుకున్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన పడిన తపన ఆదర్శనీయమని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కనకారెడ్డి ద్వితీయ కుమారుడు చింతల శ్రీపాల్ రెడ్డితో పాటు నరేందర్ రెడ్డి, అరుణ్, రాజేందర్, సాగర్, సాజిద్, మహేందర్ గౌడ్, చరణ్ గిరి పాల్గొని అంజలి ఘటించారు.

# సామాజిక బాధ్యత, అభివృద్ధి పథకాలపై అవగాహన



**హయత్‌నగర్, మే 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న "విద్యా వారోత్సవాల"లో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి బహిరంగ సభకు కళాశాల బృందం అత్యంత ఉత్సాహంగా తరలివెళ్లింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు పర్యవేక్షణలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు 4 ప్రత్యేక బస్సుల్లో ఎల్‌బీ స్టేడియానికి బయలుదేరారు. రాష్ట్ర అభివృద్ధి పథకాలు, ప్రగతి ప్రణాళికలపై అవగాహన కల్పించడం, యువత పాత్రను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి విభాగాలు ఈ పర్యటనను సమన్వయం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం ద్వారా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పుల గురించి విద్యార్థులు సమగ్రంగా తెలుసుకున్నారు. ఎల్‌బీ స్టేడియం ప్రాంగణం విద్యార్థుల నినాదాలు, ఉత్సాహంతో కోలాహలంగా మారింది.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ, "ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో విద్యార్థులు నేరుగా భాగస్వాములవడం వల్ల వారిలో సామాజిక బాధ్యతా భావన పెరుగుతుంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి" అని పేర్కొన్నారు.అంతేకాకుండా విద్యా వారోత్సవాలలో భాగంగా కళాశాల ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో సంభవ్ ఫౌండేషన్, ప్రథమ్ ఫౌండేషన్‌లతో శిక్షణ, ఉపాధి కల్పనకు సంబంధించి ఎంఓయూ ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.


# సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



**మర్పల్లి మే 11 (జనంసాక్షి)** విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి గ్రామ సర్పంచ్ రామేశ్వర్ అన్నారు. సోమవారం మర్పల్లి మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్పల్లి నందు సమ్మర్ క్యాంపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిలయ్య మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 15 రోజులపాటు నిర్వహించబడుతుందని, ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న మండలంలోని ఏ పాఠశాల విద్యార్థులైన ఈ శిబిరంలో పాల్గొనే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రాయింగ్ పెయింటింగ్ యోగా ముగ్గుల పోటీలు తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల విద్యాధికారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కడ్తాల్ మే11(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రజా పాలన,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నటువంటి అభివృద్ధి పనులకు ఆకర్శితులై కాంగ్రెస్ పార్టీలో జోరుగా చేరికలు కొనసాగుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామ సర్పంచ్ తేజ నాయక్ ఆధ్వర్యంలో బిజెపి,బీఆర్ఎస్ పార్టీలకు చెందిన వార్డు సభ్యులు శారద పాండు, పట్నం లలిత,పట్నం రమేష్, నాయకులు రామకృష్ణ, చంద్రశేఖర్, విగ్నేష్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి జోరుగా చేరికలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్,రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమన గల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బత్తోజు విష్ణువర్ధన్, నల్లబోతుల అయోధ్య,సయ్యద్ జలాలుద్దీన్, యాదయ్య, రాజేందర్, పట్నం నర్సింహా, పట్నం శివరాజు, కంబాలపల్లి రాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.